

# SUNDARAYYA VIGNANA KENDRAM

1-8-1/b/25/a, Bagh Lingampally
Hyderabad - 500 044. A.P., India
Tel : 91-40-27667543
Fax : 91-40-55637543

Managing Trustee : L.B. GANGADHARA RAO
Secretary : C. SAMBI REDDY
Treasurer : KORATALA SATYANARAYANA

## అమరజీవి సుందరయ్య 22వ వర్ధంతి

## కార్యదర్శి నివేదిక 19-05-2007

సుందరయ్య గారిని గురించి తెలియని వారుండరు. ఆయన నిరాడంబరత, త్యాగనిరతి, పట్టుదల, కష్టజీవుల రాజ్యం కొరకు ఆయన సాగించిన అవిశ్రాంత పోరాటం - అన్నీ అందరూ యెరిగినవే. ఆయన స్మృతి చిహ్నంగా యేర్పడిందే సుందరయ్య విజ్ఞాన కేంద్రం.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రధాన వుద్దేశ్యం మన సాంస్కృతిక వారసత్వాన్ని సమీకరించి, భద్రపరిచి, ప్రపంచానికి అందుబాటులోకి తేవడంతో పాటు భవిష్యత్తరాలకు అందించడం కూడా. దానికితోడు సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలు, సోషలిస్టు సిద్ధాంతం, ఆచరణలపై పరిశోధనను ప్రోత్సహించడం మరియు ప్రజాస్వామ్య, లౌకిక బృందాలతో కలిసి లేదా స్వతంత్రంగా పరిశోధనను చేపట్టడం.

### శోధన

గత సంవత్సరం జన విజ్ఞాన వేదికతో కలిసి మన రాష్ట్రంలోని మొత్తం 23 జిల్లాలకు మండలస్థాయి వరకు సమగ్ర అభివృద్ధి ప్రణాళికలను తయారుచేసే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టాము. దానికి సంబంధించి గతసంవత్సరం మేనెల నుండి యిప్పటివరకు నాలుగుసార్లు మొత్తం 11 వర్కుషాపులు జరిగాయి. చివరగా జరిగిన 6 వర్కుషాపులలో మనకు పరిచయాలున్న 12 మంది ప్రొఫెసర్లు కూడా పాల్గొన్నారు. వారినుండి కూడా మంచి సూచనలు అందాయి. వాటిని కూడా దృష్టిలో పెట్టుకునే సమాచారాన్ని సేకరించడం, ప్రోసెస్ చేయడం జరిగింది. చాలా జిల్లాలు కూడా మేము కోరిన సమాచారాన్ని సేకరించి పంపాయి. దానిని సరిదిద్ది తప్పొప్పులను సూచిస్తూ వారికి ఉత్తరాలు వ్రాయడం, స్టడీ మెటీరియల్ సేకరించి జిరాక్స్ కాపీలు పంపడం - యిట్లా జిల్లాలతో నిత్యసంబంధాలు కొనసాగించాము.

E-mail : murali@hd1.vsnl.net.in
Website : http://dsal.uchicago.edu/bibliographic/urlc/svkabout.html
Reg. Office : Akulavari Street, Vijayawada - 520 002, Andhra Pradesh, India.

మొత్తం రాష్ట్రాలు, మనరాష్ట్రంలో జిల్లాలు, మండల స్థాయిల్లో 40 పైగా అంశాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి క్రోడీకరించడం జరిగింది. అందులో వ్యవసాయం, వర్షపాతం, కమతాలు, పంటలు, నీటిపారుదల, పరపతి, పరిశ్రమలు, వాణిజ్యం, రవాణా, సమాచారం, పౌర సదుపాయాలతోపాటు విద్య, వైద్యం, వర్గాలు, సామాజిక తరగతుల పరంగా జనాభా లెక్కలు, GDP, GSDP, తలసరి ఆదాయం లాంటి అంశాలకు సంబంధించిన సమాచారం వుంది. దీనితో మొదటి దశ పని పూర్తి అయింది.

రెండవ దశలో శాంపుల్ సర్వే - ప్రతిజిల్లాలో కనీసం మూడు లేక నాలుగు గ్రామాల్లో సర్వే చేపట్టాలి. యింతవరకు సేకరించినదంతా ప్రభుత్వ సమాచారం. కాబట్టి శాంపిల్ చెకింగ్ అవసరం. వనరులకు సంబంధించి మనదగ్గర కొద్ది సమాచారమే వుంది. దానిని కూడా ఈ సర్వేలో భాగంగా సేకరించాలి. వ్యవసాయ కార్మికుల స్థితిగతులు, వ్యవసాయం గిట్టుబాటు గురించి , కౌలు విస్తృతి, కౌలుదార్ల పరిస్థితి, సామాజిక కట్టుబాట్లు యిత్యాది అంశాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించాలి. దానికి సంబంధించి ఒక సుధీర్ఘమయిన ప్రశ్నాపత్రాన్ని తయారుచేశాము. దాన్ని నల్గొండ జిల్లా కంపసాగరం గ్రామంలో పరీక్షకు పెట్టి మెరుగులు దిద్దాము. యిక జిల్లాల్లో సర్వేచేసే గ్రూపులను తయారుచేసి వారికి శిక్షణయిచ్చి యీపని ప్రారంభించాలి. యిదంతా పూర్తి అయిన తరువాత జిల్లా కార్యకర్తల తోడ్పాటుతో ఆయా జిల్లాల సమగ్రాభివృద్ధి ప్రణాళికను తయారుచేయాలి. అలాగే రాష్ట్రప్రణాళిక, ఈ పని అంతా పూర్తికావడానికి యింకా ఆరు, ఏడు నెలలు పట్టవచ్చు.

## పరిశోధనా గ్రంధాలయం

విజ్ఞాన కేంద్రం ఆశయాలకు అనుగుణంగానే ముందు ఒక పరిశోధనా గ్రంధాలయాన్ని యేర్పాటుచేయడం జరిగింది. తెలుగు, వుర్దూ, యింగ్లీషు భాషలలో యెంతో అరుదయిన, చారిత్రకంగా విలువయిన రెండున్నర లక్షల పుస్తకాలు, జర్నల్స్, రిపోర్టులు అందులో వున్నాయి. వాటితో పాటు అనేక వ్రాత ప్రతులు కూడా వున్నాయి. ముఖ్యంగా వుర్దూ, తెలుగు భాషల్లో మరుగునపడ్డ తరతరాల మన చరిత్రకు సంబంధించిన ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలపై కొత్త వెలుగులు నింపే అరుదయిన సాహిత్యం యిక్కడ వుంది.

గ్రంధాలయంలో కేటలాగింగ్ పని చాలావరకు పూర్తయింది. యింకా కొనసాగుతూనే వుంది. కొత్తపుస్తకాలు ఎప్పుడూ వస్తూవుంటాయి. కాబట్టి అది ఒక నిరంతర కార్యక్రమం. యీ సంవత్సరం పుస్తకాలు బహుకరించిన వారిలో కీర్తిశేషులు కట్టమంచి రామలింగారెడ్డిగారి

కుటుంబం, కీర్తిశేషులు కె.వి. రఘునాథరెడ్డి గారి కుటుంబం, శ్రీ కన్నాభిరాన్, ప్రొ. చేకూరి రామారావు, ప్రొ. జావేద్ ఆలం, ప్రొ. శషీజ్ హెగ్డే, ప్రొ. విద్యుల్లతారెడ్డి, కీర్తిశేషులు రాంభట్ల కృష్ణమూర్తి గారి కుమారుడు వున్నారు. కాన్సాస్ (అమెరికా) సిటి లైబ్రరీ నుండి లక్ష పుస్తకాలు మనకు బహుమతిగా వచ్చాయి.

యీ సంవత్సరం 14 మంది పి.హెచ్.డి స్కాలర్లు, 7 గురు యం.ఫిల్ విద్యార్థులు మన గ్రంథాలయాన్ని వుపయోగించుకున్నారు. పరిశోధనకు వారు యెన్నుకున్న అంశాలలో కొన్ని:

1. తెలుగు నవల
2. తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ
3. మహిళల పద్యసాహిత్యం
4. జానపద సాహిత్యం
5. తెలంగాణా సాయుధ పోరాటంలో స్త్రీల పాత్ర
6. తెగ, కులం, లింగం - అభివృద్ధి
7. వ్యవసాయంలో మహిళా శ్రామికులు మొ.

పరిశోధనకు వారు 700 లకు పైగా గ్రంథాలను వుపయోగించుకున్నారు.

## మైక్రోఫిల్మింగ్, డిజిటైజేషన్.

తెలుగు, వుర్దూ భాషల్లో వున్న ముఖ్యమయిన గ్రంథాలను విశ్వవ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చే ప్రత్యేక format (MARC) లో కాటలాగ్స్ తయారుచేసి విజ్ఞానకేంద్రం వెబ్‌సైటులో వుంచుతున్నాము. దాని కొరకు వేటపాలెం సారస్వత నికేతనం, కడప బ్రౌన్ గ్రంథాలయం, స్టేట్ ఆర్కివ్స్, హైదరాబాద్ శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషానిలయం లాంటి ప్రసిద్ధ గ్రంథాలయాల నుండి పుస్తకాలు సేకరించాము. అలాగే యీ గ్రంథాలయాల్లోని జీర్ణావస్థకు చేరిన పుస్తకాలను డిజిటైజేషన్ లేదా మైక్రోఫిల్మింగ్‌చేసి భద్రపరుస్తున్నాము.

## పఠనాలయం, కళానిలయం, నృత్యశాల

పఠనాలయాన్ని నిత్యం 350 నుండి 400 మంది వుపయోగించుకుంటున్నారు. బాలబాలికల నృత్య శిక్షణాలయానికి 25 మందికి తగ్గకుండా వస్తున్నారు. దాని వార్షికోత్సవం యెప్పటి మాదిరిగానే పిల్లల తల్లిదండ్రులు, బంధు మిత్రుల సమక్షంలో బాగా జరిగింది.

కళానిలయంలోని కుర్చీల కుషన్లు బాగా గట్టి పడిపోయాయి. వాటిని మార్చి కొత్త కుషన్లు వేయించాము, మరుగుదొడ్లు కారుతూ వుంటే వాటిని కూడా పూర్తిగా పునర్నిర్మించడం జరిగింది. సుందరయ్య కళానిలయం, మినీహాలు నిత్యం కార్యక్రమాలతో నగర ప్రజల సాంస్కృతిక అవసరాలను తీరుస్తున్నాయి.

## భవన నిర్మాణము

విజ్ఞానకేంద్రంలో యిప్పుడున్న వసతి దాని అవసరాలకేమాత్రం చాలడం లేదు. దానికి తోడు మన కృషిని సాంస్కృతిక, పరిశోధనా రంగాలకు మరింత విస్తరించడానికి మరికొంత వసతి అవసరమవుతుంది. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని గచ్చిబౌలిలో ప్రభుత్వమిచ్చిన 4 యెకరాలస్థలంలో 7 కోట్ల రూపాయల అంచనాతో భవన నిర్మాణాన్ని చేపట్టాము. సంవత్సరం పూర్తిఅయింది. మరొక సంవత్సరంలో మొదటిదశ నిర్మాణం పూర్తి కావచ్చు.

యింతకాలం దాతలు అనేక విధాలుగా తోడ్పాటునందించారు. వారి అండదండలు, ట్రస్టు సభ్యుల దీక్ష, సిబ్బందితోడ్పాటుతోనే విజ్ఞాన కేంద్రం యింతగా రాణింపుకు వచ్చింది. యిక్కడే కాదు, అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతలు గడించిన విదేశీ విశ్వవిద్యాలయాలు, విద్యారంగ సంస్థల నుండి కూడా అండదండలు సంపాదించగలిగే స్థాయికి అది చేరింది. యిదంతా మన సాంస్కృతిక సంపదను కాపాడి, ప్రపంచానికి అందుబాటులోకి తెచ్చి, మన గతాన్ని మరింత సమగ్రంగా అర్థం చేసుకోడానికి తోడ్పడేదిశలో పరిశోధనను ప్రోత్సాహించడానికే. మా యీ ప్రయత్నానికి యింతకు ముందు మాదిరిగానే యిప్పుడు కూడా పుష్కలంగా మీ తోడ్పాటు అందగలదని ఆశిస్తున్నాను. అందించాలని కోరుతున్నాను.

విజ్ఞాన కేంద్రం పురోభివృద్ధికి తోడ్పడిన దాతలందరికి మరొక్కమారు ధన్యవాదాలు తెలియజేస్తూ సభకు విచ్చేసిన పెద్దలు, సోదర,సోదరీమణులందరకూ విజ్ఞాన కేంద్రం తరపున స్వాగతంచెబుతూ శెలవుతీసుకొంటున్నాను.

సి. సాంబిరెడ్డి
కార్యదర్శి

హైదరాబాద్
19-05-07